ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024



ముంగిట్లో ముఖ్యమంత్రి

- అరెస్టులు.. ఆందోళనలు.. పరదాలు లేవు
- ప్రశాంత వాతావరణంలో సీఎం ప్రజావేదిక
- ఎప్పటిలాగే తెరుచుకున్న దుకాణాలు.. హోటళ్లు

సీఎం సభ వద్దే దుకాణాలు



పల్లె వీధుల్లో తిరుగుతూ పలకరింపులు

వచ్చేశా.. మీకోసం..



"బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామం..! ముఖ్యమంత్రి వస్తున్నారు. అయినా.. ఊరిలో అసాధారణ భద్రత లేదు. పోలీసుల హడావుడి, అరెస్టులు లేవు. గృహ నిర్బంధాలు లేవు. ఓ సాధారణ పౌరుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఊరిలో పర్యటించారు. పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పలకరించారు. మంచీ చెడు తెలుసుకున్నారు. వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు. పింఛన్ సొమ్మును స్వయంగా అందజేసి.. వారి గుండెల్లో ఆనందాన్ని నింపి బయటకు వచ్చారు. పల్లె వీధుల్లో నడుస్తూ.. కనిపించినవారిని పలకరించారు. అచ్చం.. ఆ ఊరి పెద్దలా..! మనూరి మనిషే అనుకునేలా..! 'మిమ్మల్ని టీవీల్లో చూశాం. ఇప్పుడు నేరుగా చూస్తున్నాం..' అంటూ.. మహిళలు అబ్బురపడ్డారు. యువకులు ఆయనతో సెల్ఫీ తీసుకున్నారు. చిన్నారులు పక్కన నిలబడి ఫొటోలు తీయించుకున్నారు. ఇన్నాళ్లూ అల్లంత దూరంలో ఉండే ముఖ్యమంత్రుల్ని చూసిన జనం.. మంత్రముగ్ధులయ్యేలా సాగింది చంద్రన్న పర్యటన..! అత్యంత సాదాసీదాగా..! ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్న సన్నిధిలో కాసేపు గడిపారు. కుటుంబ సభ్యుల పేరిట అర్చన చేయించారు. ఆ తరువాత 'ప్రజావేదిక-పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు, రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటిని దాటుకుని ప్రగతిబాట పట్టించామని ప్రకటించారు. అందరి సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు."

వివరాలు మెయిన్, 6లో..



అదిగో సీఎం తాత..





అధినేత పర్యటనలో అందరూ..



పేదింట.. తేనీటి విందు

వేదికపై సీఎం ప్రసంగం.. హాజరైన జనం



విమానాశ్రయానికి భూములు గుర్తించండి

ఉమ్మడి జిల్లా నేతలతో సీఎం చంద్రబాబు

6

ప్రగతికి బాటలు..

ఉంతకల్లు, బీటీపీ పనులకు ముఖ్యమంత్రి భరోసా

బజ్జో.. కన్నా..!



నేమకల్లులో జరిగిన సీఎం చంద్రబాబు సభ భద్రతా విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఈమె పేరు భువనేశ్వరి. స్వస్థలం గుంటూరు. నిద్రపోతున్న మూడేళ్ల కుమారుడిని గుండెలపై పడుకోబెట్టుకుని ప్రజావేదిక వద్ద విధులు నిర్వర్తించారు. తన భర్త ప్రమాదంలో గాయపడ్డారని, ఆయనకు ఇబ్బంది కలగకుండా కుమారుడిని వెంట తెచ్చుకున్నానని తెలిపారు. తన కూతురు, భర్త గుంటూరులో ఇంటి వద్ద ఉన్నారని తెలిపారు.

- బొమ్మనహాళ్

నేమకల్లు వీధుల్లో చంద్రన్న..



నేమకల్లు వీధుల్లో ప్రజలకు నమస్కారం చేస్తున్న సీఎం..

అందరితో అతిదిరిందయ్యా చంద్రం..



చిన్నారులు, మహిళలతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో..

చిన్నారికి పెద్దాయన దీవెనలు



బాగా చదువుకోవాలని చిన్నారిని ఆశీర్వదిస్తున్న సీఎం

ఐదు ఆరోగ్య ఉపకేంద్రాల అప్‌గ్రేడ్

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఐదు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పటివరకు ఆరోగ్య ఉపకేంద్రాలుగా పనిచేస్తున్న కేంద్రాలను అక్కడి జనాభా, రోగులసంఖ్యను పరిగణనలోకి తీసుకొని పీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేశారు. పార్లమెంటులో శుక్రవారం రాష్ట్ర ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర వైద్యఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు సమాధానమిస్తూ ఏపీకి కొత్తగా 88 పీహెచ్‌సీలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో అనంత జిల్లాలో రుద్రంపేట(అనంతపురంరూరల్), నూతిమడుగు(కంబదూరు), యర్రగుంట్ల(గార్లదిన్నె), ఎనుములదొడ్డి(కుందిర్పి), తాళ్లకేర(గుమ్మఘట్ట) ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇకనుంచి ఈ పీహెచ్‌సీలలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, ఇతరసిబ్బంది ఉంటూ రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. ఈవిషయాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ.దేవి కూడా ధ్రువీకరించారు.



నేమకల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

పింఛన్‌ల పంపిణీలో టాప్

జిల్లా యంత్రాంగానికి సీఎం అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోని జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. డిసెంబరు నెలకు జిల్లాలో 2,81,637 మంది లబ్ధిదారులకు రూ.123.88 కోట్ల పింఛన్ సొమ్మును ప్రభుత్వం మంజూరు చేసింది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందే శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఒకే రోజు 2,71,386 మందికి రూ.119.26 కోట్లు పంపిణీ చేశారు. 96.27 శాతం పంపిణీ పూర్తి చేసి.. రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపారు. దీంతో నేమకల్లులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, సిబ్బందిని, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను, జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టరేట్ ఎస్‌ఐసీ నుంచి డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బంది పింఛన్ల పంపిణీని పర్యవేక్షించింది.

విద్యుత్ చార్జీల భారం తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద విద్యుత్ చార్జీల పెంపుపై శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఇంత పెద్దమొత్తంలో ప్రజలపై భారం మోపడం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. గత నెలలో రూ.600కోట్లకు పైగా భారం వేసి, ఇపుడు మరో రూ.12,844కోట్ల భారం వేసేందుకు డిస్కమ్‌లు ప్రతిపాదించగా రూ.9,412కోట్లు మాత్రమే భారం వేసేందుకు అంగీకరించామని ఈఆర్‌సీ కార్యదర్శి పి.కృష్ణ చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం, అదానీల పాపాల భారాన్ని ప్రజలపై వేయడమేంటని ప్రశ్నించారు. ఆనాటి అక్రమ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా వైసీపీ విధానాలను కొనసాగిస్తూ అదానీకి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పంప్‌డ్ స్టోరేజ్ ద్వారా 6200 మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్ రూ.2.49 పైసలకు కొనుగోలు చేసి, ఆ భారాన్ని ప్రజలపై వేయడం తగదన్నారు. ఇప్పటికే కృష్ణపట్నం ఓడరేవులో 75శాతం, గంగవరం ఓడరేవులో రాష్ట్ర ప్రభుత్వం వాటా పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ చార్జీల వల్ల యూనిట్‌కు 50పైసలకు పైగా భారం పడుతోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు భారీగా పెరిగిన పరిస్థితుల్లో ఇంత పెద్దమొత్తంలో విద్యుత్ భారాలు వేయడాన్ని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్, ముత్తుజ, గోపాల్, వలి, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తేలని లెక్క

వైసీపీ నేత గ్రావెల్ దందాపై మూడో రోజు తనిఖీ



అనుమతిలేని లేఔట్లలో గ్రావెల్ దందాపై తనిఖీ చేస్తున్న తహసీల్దార్

యాడికి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ నాయకుడి గ్రావెల్ అక్రమ దందాపై మూడురోజులుగా తనిఖీలు చేస్తున్నా, పూర్తిగా లెక్కతేలడం లేదు. వైసీపీ నాయకుడు అనుమతులు లేకుండా వేసిన లేఔట్లలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి శనివారం తనిఖీలు నిర్వహించారు. సర్వేనెంబర్లు 937, 938, 939, 940, 943, 945, 964-1, 964-3, 509, 510-7, 510-8, 510-9, 510-10 లేఔట్లలోని అంతర్గత రోడ్లను పరిశీలించారు. ఎంత మేరకు గ్రావెల్ దందా జరిగిందో పరిశీలించారు. యాడికిలోని లేఔట్ల అనుమతులపై గ్రామ పంచాయతీ సిబ్బందిని వివరణ కోరారు. యాడికిలో ఒక్క లేఔట్‌కు మాత్రమే అనుమతులు ఉన్నాయని మిగిలినవాటికి అనుమతులు లేవని గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. గ్రావెల్ దందాపై పూర్తిస్థాయి తనిఖీ, విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ సుంకన్న, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంతుతేలని లెక్క

యాడికిలో గ్రావెల్ దందా అంతులేనిదిగా ఉంది. మూడురోజులు తనిఖీలు నిర్వహించినా ఎంత మొత్తంలో గ్రావెల్ దందా జరిగిందో అధికారులు ఇంకా లెక్కతేల్చలేకపోయారు. మొదటిరోజు విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రెండోరోజు మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మూడోరోజు రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. గ్రావెల్ దందాపై ఇంకా తనిఖీలు, విచారణ చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రావెల్ దందా పెద్దమొత్తంలో జరిగే ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్..

ఫిజికల్ డైరెక్టర్‌కు **షోకాజ్ నోటీస్**

హంతకుల కోసం ప్రత్యేక బృందాల వేట

బాలుడి హత్య కేసు దర్యాప్తు వేగవంతం

7లో..



వాగ్దానాలను నిలబెట్టుకోండి


సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ సూచించారు. కళ్యాణదుర్గంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేమకల్లులో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొనడం ఆనందించదగ్గ విషయమన్నారు. అయితే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చకుండా కాలయాపన చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి అర్హులైన పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలో పంట నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయం, విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం పథకం కింద అందించే లబ్ధిపై కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అదానీ, జగన్ లంచాల వ్యవహారంపై ప్రధాని స్పందించకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి ప్రజల్ని విద్యుత్ చార్జీల పేరుతో బాధించడం తగదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దినాన్ని జరుపుకుంటున్న వేళ లౌకిక, సామ్యవాద పదాలను తొలగిస్తామంటూ బీజేపీ పేర్కొనడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మల్లికార్జున, సీపీఐ పట్టణ కార్యదర్శి ఓంకార్, మండల కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. మీ బాధ్యత: సీఎం



ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు సవిత, కేశవ్, కలెక్టర్

అనంతపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దాం. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. నేమకల్లులో ప్రజావేదిక అనంతరం హెలీప్యాడ్ వద్ద కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి గురించి చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేద్దామని, అందుకు అవసరమైన భూములు గుర్తించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు అనువైన ప్రాంతాన్ని, అవసరమైన భూములను గుర్తించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరును అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనుల పురోగతిని ప్రభుత్వం దృష్టి తీసుకురావాలని, నిధుల కోసం చొరవ చూపాలని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురంలో డంపింగ్ యార్డు మార్చేందుకు అనువైన ప్రాంతం చూడాలని, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చొరవ చూపాలని చంద్రబాబు సూచించారు. శింగనమల నియోజకవర్గానికి తాగునీటిని అందించేందుకు గండికోట నుంచి పైపులైన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పేరూరు, అప్పర్ పెన్నార్ పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. నడిమి వంక ప్రొటెక్షన్ వాల్, రాప్తాడులో జాకీ పరిశ్రమను తిరిగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు



సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబును దగ్గరగా చూసిన ఆనందం



మహిళల కేరింతలు

ప్రగతికి బాటలు





పలకరింపులు.. పులకరింపులు

పింఛన్ లబ్ధిదారుల ఇంటికి చంద్రబాబు

వీధుల్లో నడుస్తూ.. జనంతో మాటామంతీ

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేమకల్లులో పాల్తూరు రుద్రమ్మ, భాగ్యమ్మ ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. రుద్రమ్మ ఇంట్లో టీ ఇవ్వబోతే.. ధన్యవాదాలు తెలిపారు. భాగ్యమ్మ ఇంట్లో టీ స్వీకరించారు. గ్రామ వీధుల్లో నడుస్తూ.. ప్రజలను పలకరించారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ సాధారణ పౌరుడిలా తమ ఊరి వీధుల్లో తిరగడం చూసి జనం మురిసిపోయారు.



పాల్తూరు రుద్రమ్మ: నమస్కారం సార్ బాగున్నారా ?
చంద్రబాబు: నమస్కారం అమ్మా. మీరు బాగున్నారా ? ఎంత మంది కొడుకులు ?
పాల్తూరు రుద్రమ్మ: బాగున్నాము సార్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు.
చంద్రబాబు: పింఛన్ డబ్బులు ఎంతిస్తారు ?
పాల్తూరు రుద్రమ్మ: నాలుగు వేలు ఇస్తున్నారు సార్.
చంద్రబాబు: కొడుకులు ఏం పని చేస్తారమ్మా ?
పాల్తూరు రుద్రమ్మ: వ్యవసాయం చేస్తున్నారు సార్
చంద్రబాబు: మీ కుటుంబానికి ఏమి కావాలమ్మా..?
పాల్తూరు రుద్రమ్మ: గొర్రెలు, ఇల్లు కావాలి సార్.
చంద్రబాబు: సరే అమ్మా. మీకు ఇల్లు, గొర్రెలు ఇస్తాము.


రుద్రమ్మ కొడుకులు గణేష్, మారేష్‌తో..
చంద్రబాబు : బాగా పనిచేసుకోవాలి. ఊరికే ఉంటే ఎలా ? పొలం ఎంత ఉంది..?
గణేష్, మారేష్ : రైతు పని చేస్తున్నాం సార్. మూడెకరాలు ఉంది సార్, పంట సరిగా రావడం లేదు.
చంద్రబాబు : ఓకే అమ్మా.. మీకు సాయం చేస్తా.. వస్తాను.

■ దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంట్లో..



భాగ్యమ్మ : నమస్కారం సార్
చంద్రబాబు : నమస్కారం అమ్మా. పింఛన్ ఎవరికి వస్తుంది..?
భాగ్యమ్మ : నాకు, మా నాన్నకు వస్తుంది సార్.
చంద్రబాబు : ఎంత వస్తుందమ్మా ?
భాగ్యమ్మ: నాకు 15 వేలు, మా నాన్నకు నాలుగు వేలు సార్..
చంద్రబాబు: పొలం ఎంత ఉంది ?
భాగ్యమ్మ : ఏడెకరాలు ఉంది.
చంద్రబాబు: ఇంట్లో ఎంత మంది ఉన్నారు ?
భాగ్యమ్మ: తొమ్మిది మంది ఉన్నాం సార్.
చంద్రబాబు: పింఛన్ డబ్బులు ఏమి చేస్తున్నారు ?
భాగ్యమ్మ: నా తమ్ముడి కూతురు జాహ్నవికి బాగా లేదు. వైద్యం కోసం ఖర్చు పెడుతున్నాం సార్.
చంద్రబాబు: ఓకేనమ్మా మీకు ఇల్లు కట్టించి, కిరాణాషాపు పెట్టిస్తాం. ఆర్థిక సాయం చేస్తాం.
భాగ్యమ్మ : టీ తాగండి సార్
చంద్రబాబు : సరే అమ్మా.. ఇవ్వండి..

■ (టీ తాగిన తర్వాత ప్రజావేదికపై చంద్రబాబు భాగ్యమ్మ తమ్ముడి కూతురు వైద్య ఖర్చుల కోసం రూ.రెండు లక్షల చెక్కును అందించారు. భాగ్యమ్మ ఇంటి నుంచి వస్తూనే రోడ్డు పక్కన అంగడి పెట్టుకున్న హనుమేష్‌ను పలకరించారు..)



చంద్రబాబు: ఏం తమ్ముడూ బాగున్నావా ?
హనుమేష్: బాగున్నాను సార్.
చంద్రబాబు : ఏం అంగడి ?
హనుమేష్: కిరాణా అంగడి సార్.
చంద్రబాబు: ఎంత వ్యాపారం అవుతుంది ?
హనుమేష్ : రూ.100 నుండి రూ.150 వస్తుంది సార్
చంద్రబాబు: నెలకు ఎంత వ్యాపారం అవుతుంది..?
హనుమేష్: ఐదు వేల వరకూ అవుతుంది సార్.
చంద్రబాబు: కలెక్టర్ గారూ, సూపర్‌మార్కెట్ కోసం లోన్ మంజూరు చేయించండి.

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాయదుర్గం నియోజకవర్గ ప్రగతికి బాటలు వేసేలా వరాల జల్లు కురిపించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సమర్పించిన వినతి పత్రంలో పొందుపరిచిన అంశాలన్నింటికీ సానుకూలంగా స్పందించారు. ప్రజా వేదిక మీదుగా ఆయన పలు హామీలు ఇచ్చారు. నేమకల్లు-ఉంతకల్లు మధ్యలో ఐదు టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించిన రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి కృష్ణజలాలను మళ్లించేందుకు రూ.965 కోట్లతో చేపట్టిన పనులు 35 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు అన్నారు. కృష్ణజలాలతో రాయదుర్గం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసానిచ్చారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా 36ఎ ప్యాకేజీ ద్వారా మాల్యం, ఆవులదట్ల డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి, నీరిస్తామన్నారు. జిల్లాలో ఎడారి ఛాయలు ఇక్కడి నుంచే మొదలు అవుతున్నాయనే విషయం తనకు తెలుసునని, 20 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇసుకమేటలను నియంత్రించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇనుప ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో నేమకల్లు - డి.హీరేహాళ్ మధ్యలో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ప్రాంతాన్ని పారిశ్రామిక పార్క్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. డి.హీరేహాళ్‌లో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువును హెచ్చెల్సీకి అనుసంధానించి, సాగునీరు ఇస్తామని అన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

ఉంతకల్లు, బీటీపీ పనులకు భరోసా
నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్టు
ప్రజా వేదికపై ప్రకటించిన చంద్రబాబు

నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్ట్

'ఇంటింటికీ సోలార్ పవర్' ప్రాజెక్టును నేమకల్లు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. నేమకల్లులో ఉన్న 759 ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను సబ్సిడీ ద్వారా అమర్చి విద్యుత్ ఉత్పత్తి చేయిస్తామని అన్నారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వాడుకుని, మిగిలిన విద్యుత్‌ను విక్రయించే అవకాశం కూడా కల్పిస్తామని అన్నారు. 1,49,721 చదరపు అడుగులలో సోలార్ ప్యానల్స్ అమర్చి 1379 కిలో వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టును ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు.

సెల్‌ఫోన్‌లో పౌర సేవలు

ఇంట్లో కూర్చుని సర్టిఫికెట్లు తీసుకోవచ్చు
గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తాం
రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపిస్తాం
నేమకల్లు సభలో సీఎం చంద్రబాబు



రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చేతిలో ఉండే సెల్‌ఫోన్‌తో కుటుంబంలోని ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సేవలన్నీ అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేమకల్లులో శనివారం పింఛన్ల పంపిణీ అనంతరం 'ప్రజా వేదిక పేదల సేవలో..' సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగం ప్రవాహంలా గంటకుపైగా సాగింది. రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రసంగించారు. మద్యం, గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తామని హెచ్చరించారు. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం ముందు కార్యక్రమం జరుగుతోందని, స్వామి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు 11వ తేదీన కణేకల్లుకు వచ్చానని, ఆ 11 అంకెను ప్రతిపక్షానికి ఇచ్చానని చమత్కరించారు. సభలో ఉన్న అందరూ తమ సెల్‌ఫోన్‌లను ఎత్తి చూపాలని కోరారు. భవిష్యత్తులో సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందిస్తామని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకునే పరిస్థితి ఉండదని అన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని బయటకు రాగానే వేదిక వద్ద ఉన్న జనం కేరింతలు వేశారు. ఆయన ప్రసంగాన్ని ఉత్సాహంగా వింటూ.. చప్పట్లతో మద్దతు తెలిపారు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారని, రేషన్ మాఫియాను కట్టడి చేస్తామని అన్నారు. భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు ఫైళ్లపై సంతకాలు పెట్టామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనంతగా రూ.4 వేలు పింఛన్ ఇస్తున్నామని చెబుతూ.. ఇతర రాష్ట్రాలలో ఎంత ఇస్తున్నారో గణాంకాలను తెలిపారు. దీపం-2 పథకం గురించి వివరిస్తూ.. తన తల్లి కట్టెల పొయ్యితో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నారు. మహిళలు ఎవరికీ ఆ కష్టం ఉండకూడదనే అప్పట్లో దీపం పథకం తెచ్చామని, ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని అన్నారు. అర్హులందరికీ ఉచిత సిలెండర్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. నాలుగు గంటల పాటు సాగిన సీఎం పర్యటన.. ప్రశాంతంగా ముగిసింది.

ఏ హడావుడీ లేకుండా..

ముఖ్యమంత్రి పర్యటన అంటే.. ఎక్కడ లేని నిబంధనలను అమలు చేస్తారు. దుకాణాలను మూసివేయిస్తారు. వైసీపీ హయాంలో పరదాలనూ కట్టించారు. చెట్లు నరికించి, బారికేడ్లు ఏర్పాటు చేయించి.. నిర్బంధం మధ్య పర్యటనలు సాగించారు. కూటమి ప్రభుత్వం అలాంటి సంస్కృతికి చరమగీతం పాడింది. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీఎం సభ ఉన్నా.. ఆలయ కాంప్లెక్స్ ఉండే దుకాణాలు యథాతథంగా తెరిచారు. ఎప్పటిలాగే వ్యాపారాలు చేసుకున్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగించలేదు. ముందస్తు అరెస్టులు లేవు. ప్రజలందరూ స్వేచ్ఛగా ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసమీకరణ ఏమాత్రం చేయలేదు. ఆ ఊరి ప్రజల మధ్య సభ సాగింది. ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదు.



చంద్రన్నకు అంజన్న చిత్రపటం కానుక



చెల్లెమ్మ సెల్ఫీ సంబరం

చంద్రబాబు కృషితోనే హార్టికల్చర్ హబ్: అంబికా



కరువు ప్రాంతమైన జిల్లాపై చంద్రబాబు ప్రత్యేక ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని ఎంపీ లక్ష్మీనారాయణ అన్నారు. చంద్రబాబు చొరవతో 2014 నుంచి జిల్లాలో అరటిసాగు పెరిగిందని, 20 టన్నులతో అప్పట్లో ఎగుమతిని ప్రారంభించి.. ఏకంగా లక్ష టన్నులకు చేర్చారని కొనియాడారు. అరటి ఎగుమతి కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారని, అనంత అరటి విదేశాలకు పంపేస్థాయికి చేర్చారని అన్నారు. 10వేల హెక్టార్లలో పండించిన 8.5 లక్షల టన్నుల అరటిలో లక్ష టన్నుల అరటిని విదేశాలకు పంపుతున్నామని అన్నారు. జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారిందని, ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే అరటి, దానిమ్మ, సపోట, బత్తాయి దిగుబడులను విదేశాలకు పంపే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ఏడు కరువు మండలాలను ప్రకటించారని, మిగిలిన మండలాలను కూడా ప్రకటించాలని కోరారు.

దేశం మెచ్చే నాయకుడు: కాలవ



ఐదేళ్ల దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించిన చంద్రబాబు దేశం మెచ్చే నాయకుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. నేమకల్లు ప్రజావేదికపై ఆయన ప్రసంగించారు. కాలవ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం చంద్రబాబుతో పాటు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మహాలక్ష్మి పాల్గొన్నారు. నేమకల్లు - ఉంతకల్లు మధ్యలో రిజర్వాయర్ నిర్మించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు. రాయదుర్గంపై చంద్రబాబుకు ప్రత్యేక ప్రేమాభిమానాలు ఉన్నాయని అన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ.4500 కోట్లు మంజూరు చేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. జిల్లాకు వరప్రసాదం లాంటి హంద్రీనీవా తొలిదశ విస్తీరణ పనులను త్వరలో చేపట్టడానికి సీఎం సంసిద్ధులై ఉన్నారని అన్నారు. అది పూర్తి అయితే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీరు వస్తుందని అన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు 36ఎ ప్యాకేజీ కింద 64 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎడారీకరణ ఆగేలా సీఎం చర్యలు తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. బీసీలు అధికంగా ఉన్న నేమకల్లులో బాలురకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పీహెచ్‌సీతో పాటు ఆంజనేయస్వామి గోపురానికి రూ.3.75 కోట్లు మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలను పూర్తి చేయడానికి రూ.ఐదు కోట్లు మంజూరు చేయాలని కోరారు.

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు నేమకల్లు హెలీప్యాడ్ వద్ద ఘనస్వాగతం లభించింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, సెర్ప్ సీఈఓ వీర పాండ్యం సీఎంకు స్వాగతం పలికారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చంద్రబాబుకు పుష్ప గుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి స్వాగతం పలికారు.

పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు మధ్యాహ్నం 1.30 గంటలకు నేమకల్లు హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న వాహనంలో మధ్యాహ్న భోజనాన్ని ముగించారు. ఆ తరువాత 2.20 గంటలకు రుద్రమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. 2.36 గంటలకు భాగ్యమ్మ ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. అక్కడి నుంచి గ్రామ వీధుల్లో నడుచుకుంటూ 2.48 గంటలకు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని 3.05 గంటలకు ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రసంగించారు. 4.12 గంటలకు సమావేశాన్ని ముగించుకుని హెలీప్యాడ్ వద్దకు బయలుదేరారు. 4.25 గంటలకు హెలీక్యాప్టర్‌లో బళ్లారిలోని జిందాల్ విమానాశ్రయానికి బయలుదేరారు.

స్వాగతం.. సుస్వాగతం..!



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి



పూల బొకేతో కాలవ స్వాగతం



చంద్రబాబుకు నమస్కరిస్తున్న కేశవ్



ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎమ్మెస్ రాజు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీఎం



మొక్క అందజేసిన జేసీ..



అసిస్టెంట్ కలెక్టర్..



డీఐజీతో మాటా..మంతీ



సీఎంతో ప్రభాకర్ చౌదరి

న్యూస్ బాక్స్

ఏఆర్‌టీ సెంటర్‌కు పురస్కారం



జిల్లా ఆస్పత్రిలో హెచ్‌ఐవీ బాధితులకు సేవలందిస్తున్న ఏఆర్‌టీ సెంటర్ ఇదే..

అనంతపురంటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు ఉత్తమ సేవలందించినందుకు అనంత సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. ఈఏడాదిలో 48మంది గర్భిణులు, 111మంది టీబీ రోగులు, 166మంది హెచ్‌ఐవీ బాధితులకు ఈసెంటర్‌లో అవసరమైన వైద్యసేవలు అందించారు. ఈనేపథ్యంలో ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకొని ఇక్కడి సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో అవార్డును ఏఆర్‌టీ సెంటర్ డాక్టరు సత్యనారాయణ ఆదివారం అందుకోనున్నారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టరు హేమలత, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టరు అనుపమజేమ్స్ ఆయన్ను అభినందించారు.

జాతీయ పోటీలకు నవనీత్



అనంతపురం క్లాక్ టవర్, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన నవనీత్ ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-19 ఫెన్సింగ్ క్రీడాపోటీల్లో నవనీత్ మెరుగైన ప్రతిభ చాటాడు. దీంతో అతడిని జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 15 నుంచి బిహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొననున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన నవనీత్‌ను ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు కోన ఉప్పలపాడు విద్యార్థి



లోకనాథ్

యాడికి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు కోన ఉప్పలపాడు హైస్కూల్ విద్యార్థి లోకనాథ్ ఎంపికైనట్లు పాఠశాల పీడీ చిన్నఓబులు, ప్రధానోపాధ్యాయుడు చిన్నపెద్దన్న శనివారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరుజిల్లా పూతలపట్టులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్-14 విభాగంలో త్రోబాల్ పోటీలో లోకనాథ్ అద్భుతమైన ప్రతిభ చూపినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైన లోకనాథ్‌ను టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, కోనుప్పలపాడు సర్పంచు రామలక్షుమ్మ, గ్రామస్థులు అభినందించారు.

ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీ

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 17247/48) రైళ్లకు డిసెంబరు నెలలో ఒక అదనపు బోగీని జతచేసి నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లకు డిసెంబరు 1 నుంచి జనవరి 1 వరకూ ఒక 2టైర్ ఏసీ బోగీని చేర్చి నడపనున్నట్లు తెలిపారు.

845 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 845 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 748 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 26 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 20, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.29వేలు

అనంతపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 29,400 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 19వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 29 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వికసిత్ భారత్‌కు ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న యువతను ఆహ్వానించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ తెలిపారు. 2025 జనవరి 11, 12వతేదీల్లో ఢిల్లీలోని భారత్‌మండపంలో నిర్వహించే స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలలో ప్రధాని మోదీతో సంభాషించే అవకాశం యువతకు కల్పిస్తున్నట్లు తెలిపారు. మోదీతో నేరుగా మాట్లాడేందుకు డిసెంబరు 5లోపు మేరాభారత్ ప్లాట్‌ఫాం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడ్డేది..?

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సరీలు
- ప్రభుత్వ అనుమతులు కొన్నింటికే
- నాసిరకం మొక్కలు అంటగడుతున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారయంత్రాంగం

సంప్రదాయ పంటలతో ఎప్పుడూ నష్టాలే వస్తుండటంతో పలువురు రైతులు కూరగాయల పంటల సాగువైపు మొగ్గుతున్నారు. ఈక్రమంలోనే టమోటా, మిర్చి వంటి పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ పంటల సాగుకు అవసరమైన మొక్కల కోసం నర్సరీలపై ఆధారపడుతున్నారు. రైతుల అవసరాల దృష్ట్యా పుట్టగొడుగుల్లా నర్సరీలు పుట్టుకొచ్చాయి. ఇందులో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. అసలు ప్రభుత్వ అనుమతులే తీసుకోవడం లేదు. ఫలితంగా నాసిరకమైన మొక్కలను రైతులకు అంటగడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు నర్సరీల నిర్వాహకులు అంటగట్టిన మొక్కలతో తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీల నిర్వాహకులు తమను మోసం చేశారని రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం నియోజకవర్గంలో 200 పైబడి నర్సరీలు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ నిబంధనలకు పాతరేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

- కళ్యాణదుర్గం/కుందుర్పి (ఆంధ్రజ్యోతి)



నర్సరీలో పెంచుతున్న టమోటా నారు

● నిబంధనలు ఇలా...

నర్సరీల నిర్వాహకులు నాణ్యమైన, నమ్మకమైన ఉద్యాన మొక్కలను తయారు చేసి రైతులకు అందించాలి. సిఫారసు చేసిన ఉద్యాన పంటల రకాల నారును మాత్రమే సిద్ధం చేయాలి మొక్క పేరు, మూలాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పురుగులు, తెగుళ్లు సోకని మొక్కలను రైతులకు సరఫరా చేయాలి. ఐదేళ్లలో జరిగిన మొక్కల అమ్మకాల వివరాలను యాజమాన్యం రికార్డు చేయాలి. మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చారు, వాటి ధరలను బోర్డులపై ఉంచాలి. ప్రభుత్వం నుంచి తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలి.

● కనిపించని ఉద్యానశాఖ అధికారులు

ఉద్యాన పంటల నాణ్యమైన మొక్కలు, విత్తన తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లో జీవో. నెంబర్. 211 ద్వారా ఉద్యాన పంటల నర్సరీల చట్టాన్ని రూపొందించింది. అనుమతులు లేకుండా నర్సరీలను కొనసాగించరాదని, ఆ విధంగా చేస్తే చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే నియోజకవర్గంలో అనేకచోట్ల అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నకిలీ మొక్కలను రైతులకు అంటగడుతున్నారని, ఎన్నో సార్లు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. దీంతో నర్సరీ నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. పైరు ఎదిగే వరకు అది నకిలీ నారా లేదా మంచిదా అనేది తెలియడం లేదు. అప్పటికే ఆ రైతులు భారీగా పంటపై పెట్టుబడి పెట్టి ఉంటారు. దిగుబడి రాకపోవడంతో పెట్టుబడితో పాటు కాయ కష్టాన్ని కూడా నష్టపోతున్నాడు.

● కర్ణాటకకు పరుగులు

నియోజకవర్గంలో నర్సరీల నిర్వాహకులు నాసిరకం టమోటా మొక్కను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నిసార్లు ఉద్యానశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ఇది ఆగడం లేదు. దీంతో విసుగు చెందిన రైతులు నాణ్యమైన టమోటా మొక్కల కోసం సమీపంలోని కర్ణాటక ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. చెళ్లికెర, పావగడ ప్రాంతాలకు వెళ్లి



కుందుర్పి మండలంలో నర్సరీని తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారులు (ఫైల్)

టమోటా, మిరప మొక్కలను ఎక్కువగా తీసుకొస్తున్నారు. అక్కడి నుంచే తెచ్చే మొక్కలు నాణ్యతగా ఉంటూ ఎక్కువ దిగుబడి ఇస్తున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

● 50 నర్సరీలకే పరిమితం

కళ్యాణదుర్గం ప్రాంతంలో 200 నర్సరీలకు పైబడి ఉన్నాయి. ఇందులో సుమారు 50 నర్సరీలకు మాత్రమే అనుమతి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మిగతా వాటికి దేనికీ లైసెన్సులు లేవు. దీనిపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఆయా నర్సరీల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లా ఉద్యానశాఖాధికారులు నర్సరీల నిర్వాహణపై తనిఖీలు చేసినా, పూర్తి స్థాయిలో నిబంధనలు అమల్లోకి రాలేదు. టమోటా సాగు ఈ ప్రాంతంలో లాభసాటిగా ఉండటంతో రైతులు ఎక్కువ శాతం మంది టమోటా సాగుకే మొగ్గు చూపుతారు. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని నర్సరీలు పుట్టగొడుగులా వెలిశాయి.

● మోసంపై దుప్పటి పంచాయితీలు

నాసిరకం టమోటా మొక్క ఇచ్చి, మోసం చేశారని, మీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని రైతులు గట్టిగా నర్సరీ నిర్వాహకులను నిలదీస్తే కొంతమంది పెద్ద మనుషుల సాయంతో దుప్పటి పంచాయతీ చేసి చేతులు దులుపుకున్న సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల్లో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కొంతమంది రాజకీయనాయకులు కూడా ఈ పంచాయితీలోకి దూరి నష్టపోయిన రైతులకు అంతో ఇంతో డబ్బులు ముట్టచెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి.

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు లేని నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని నర్సరీల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొందరు చేయించుకోలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. నకిలీ మొక్కలు ఇస్తున్నారని ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- గౌసియాబీ, ఉద్యానశాఖాధికారి

నాసిరకం టమోటా పైరుతో నష్టపోయా



నాకున్న ఐదెకరాల్లో విడతల వారీగా టమోటా సాగు చేశా. అయితే నాసిరకం టమోటా మొక్కలు ఇవ్వడంతో ఏ మాత్రం పంట దిగుబడి రాలేదు. దీంతో పూర్తిగా నష్టపోయా. కుందుర్పి మండలంలోని ఓ నర్సరీలో టమోటా మొక్కలు తీసుకొచ్చి సాగు చేస్తే పంట మొత్తం పోయింది. దీంతో పంట రాక, పెట్టుబడులు నష్టపోయి తీవ్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయా.

- రామాంజనేయులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పంట ఎదుగుదల లేదు



నాకున్న మూడెకరాల్లో టమోటా మొక్క సాగు చేశా. రోజులు గడిచినా మొక్కలో ఎదుగుదల కనిపించలేదు. ఎన్ని మందులు పిచికారి చేసినా ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. దీంతో కాస్త అనుభవం ఉన్న రైతులను తీసుకువచ్చి పంటను చూపించగా వారు పరిశీలించి, నాసిరకం మొక్కలతోనే ఇలా జరిగిందని చెప్పారు. దీంతో పెట్టుబడి మొత్తం నష్టపోయా. నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. -బొమ్మయ్య, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పూత, పిందె నిలబడలేదు



నాసిరకం టమోటా మొక్కల్లో పూత, పిందె ఏ మాత్రం నిలబడలేదు. నాకున్న నాలుగెకరాల్లో టమోటా పంటను సాగు చేశా. మూడు కోతలకే టమోటా పంట పూర్తిగా దిగుబడి కోల్పోయింది. ఏ మాత్రం ఎదుగుదల ఉండదు. నాసిరకం మొక్కను అందించే నర్సరీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

చేతన్ హత్యపై లోకేశ్ ఆరా

- హెచ్‌ఎం సస్పెన్షన్.. ఫిజికల్ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీస్
- హంతకుల కోసం ప్రత్యేక బృందాల వేట
- బాలుడి హత్య కేసు దర్యాప్తు వేగవంతం



చేతన్ (ఫైల్)

మడకశిర/మడకశిరటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మడకశిర మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న విద్యార్థి చేతన్ హత్య ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. అసలు ఏం జరిగింది అంటూ అధికారుల నుంచి సమాచారం తెలుసుకొన్నారు. పాఠశాల నుంచి ఉదయం 10.30 గంటలకు విద్యార్థి వెళితే పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కనీసం 100కు కూడా డయల్ చేయకుండా ఏం చేస్తున్నారంటూ జిల్లా స్థాయి అధికారులతో ఆరా తీసినట్లు తెలిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో చిన్నారి కిడ్నాప్ అయిన విషయంపై కేసును పోలీసులకు అందించడం పట్ల మండిపడ్డారు. ఇన్ని గంటల వ్యవధిలో ఏమి చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. మంత్రి లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాబేజ్‌పై జిల్లా అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అదే విధంగా ఫిజికల్ డైరెక్టర్ ప్రసూనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.కిష్టప్ప ఆమిదాలగొంది ప్రధానోపాధ్యాయుడు జాబేజ్‌ను సస్పెండ్ చేస్తూ అందులో పీఈటీగా పనిచేస్తున్న ప్రసూనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కడప ఆర్‌జేడీ ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు డీఈఓ వెల్లడించారు. సీఎంఓ కార్యాలయం సైతం ఆరా తీయడంతో స్వయంగా ఎస్పీ రంగంలోకి దిగి నిందితులను ఇప్పటికే గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. వారిని రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. హత్యకు గల కారణాలు, ఆ అవసరం ఎందుకు వచ్చింది అన్న కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మడకశిర సర్కిల్ కార్యాలయంలోనే ఉంటూ స్వయంగా దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. సీఐలు రామారావు, రాజ్‌కుమార్‌లకు సూచనలు ఇస్తూ దర్యాప్తును ఓ కొలిక్కి తెచ్చారు. హత్యకు సంబంధించిన ఆయుధాలను సైతం ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఎంత మంది ఇందులో పాల్గొన్నారన్న దానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టినా పాఠశాల సిబ్బంది ఏమాత్రం సహకారం అందివ్వలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం జరిగితే సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్యలోనే మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఫిర్యాదు అందించినట్లు పోలీసులు సైతం చెబుతున్నారు. పాఠశాల నుంచి విద్యార్థి బయటకు వెళ్లాలంటే తప్పనిసరిగా ఉపాధ్యాయుల అనుమతి తీసుకోవాలి. అలాంటివి ఏమీలేకుండా విద్యార్థి వెళ్లినా ఎందుకు స్పందించలేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

ఇద్దరు పిల్లలు.. తల్లి అదృశ్యం





కుళ్లాయమ్మ, పిల్లలు

అనంతపురం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన భర్త పోలీసులను ఆశ్రయించాడు. నగరంలోని ఓబుళదేవ్‌నగర్‌లో మన్నల నరేష్, కుళ్లాయమ్మ(లహరి) దంపతులు నివాసముంటున్నారు. వీరి మధ్య శనివారం వాగ్వాదం జరిగింది. భర్త నరేష్ భార్యను మందలించాడు. దీంతో మధ్యాహ్నం 3గంటల నుంచి కుళ్లాయమ్మ తన పిల్లలు తేజేశ్వర్(ఏడేళ్లు), హారిక(ఆరేళ్లు)తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రయినా రాకపోవడంతో భర్త టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సున్నీ ఇజ్‌తెమాను జయప్రదం చేయండి

● ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి



సున్నీ ఇజ్‌తెమా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న 15వ వార్షిక సున్నీ ఇజ్‌తెమాను జయప్రదం చేయాలని వక్ఫ్ బోర్డు సభ్యుడు, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి కోరారు. స్థానిక జామియా మసీదులో సున్నీ ఇజ్‌తెమాకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ షఫి మాట్లాడుతూ తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిసెంబరు 22న ఇజ్‌తెమాను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మధ్యప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ ఖాదీర్ ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మిక సందేశమిస్తారన్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెహరీక్ అధ్యక్షుడు హసన్‌రజాసాబ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆవాజ్ వలి, ముతవల్లి ఫరీదుద్దీన్, పర్వేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలలో శివలింగ ప్రతిష్ఠ



శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి వద్ద బండపై వెలసిన అయ్యప్ప ఆలయ ఆవరణంలో శనివారం శివలింగ విగ్రహప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహమ్మద్‌రఫీ సహకారంతో శివాలయ నిర్మాణం, శివలింగ ప్రతిష్ఠ చేపట్టినట్లు ఆలయ సంకల్పకుడు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. ఆలయ నిర్మాణ దాత మహమ్మద్‌రఫీ దంపతులు పురోహితుడు పంచరత్న సురేష్ శర్మతో కలిసి శివలింగ ప్రతిష్ఠాపన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.మల్లికార్జునరెడ్డి, మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకులు అరుణజ్యోతి, మాజీ కోఆప్షన్ సభ్యుడు నిజాం తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

● స్కానింగ్ సెంటర్లకు కలెక్టర్ హెచ్చరిక

పుట్టపర్తి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ నియంత్రణ చట్టంపై కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ నియంత్రణ చట్టంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. వైద్యశాఖాధికారులు నిరంతరం తనిఖీ చేసి లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడే సెంటర్ల అనుమతులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శైలజ, డీఎంహెచ్ఓ మంజువాణి, ఆర్డీటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్లపడితే అట్లా..!

- ఉరవకొండలో కొళాయిల అక్రమ కనెక్షన్లు
- పట్టించుకోని అధికారులు

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొళాయి అక్రమ కనెక్షన్లు పెరిగిపోయాయి. అనుమతులు లేకుండానే ఎవరు పడితే వారు రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను అడ్డంగా తవ్వేసి, కనెక్షన్లు తీసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా సాగిన వ్యవహారం కూటమి ప్రభుత్వంలో కూడా చాప కింద నీరులా సాగుతోంది. వైసీపీ ఎంపీటీసీ ఆదేశంతో అక్రమంగా కనెక్షన్లు ఇస్తున్నారు. అయితే అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కుళాయిల ఏర్పాటు సమయంలో రోడ్డు కటింగ్‌కు సంబంధించి పంచాయతీ అధికారులతో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అవేమీ పట్టనట్లుగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేసే సిబ్బంది కాసులు పుచ్చుకుని కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.



కుళాయి కనెక్షన్ కోసం తవ్విన గుంత

గతంలో వందకు పైగా అక్రమ కనెక్షన్లు



జలజీవన్ పేరుతో తవ్విన రోడ్డు

గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో దాదాపు వందకు పైగా అక్రమంగా కనెక్షన్లు ఇచ్చారు. ప్రధానంగా డ్రైవర్స్ కాలనీ, లక్ష్మీనరసింహకాలనీలో జలజీవన్ ముసుగులో అక్రమంగా కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. ప్రజలనుంచి కనెక్షన్‌కు రూ.10వేలు దాకా వసూలు చేశారు. అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీటిపై విచారణ చేశారు. కొళాయి అక్రమ కనెక్షన్లకు సంబంధించి డీడీ రూపంలో డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు. అయినా అవి ఆచరణ సాధ్యం కాలేదు. సీసీ రోడ్లను అక్రమంగా తవ్వి కొళాయిలను బిగించారు. రోడ్డును తవ్వడం వలన గుంతలు పడి ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్యను వివరణ కోరగా ఇప్పటి వరకు అక్రమ కొళాయిల ఏర్పాటుపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. వస్తే వాటిని తొలగిస్తామన్నారు.

సంక్షిప్తం

ముగిసిన కార్తీక పూజలు



అలంకరణలో దొనరామేశ్వరస్వామి

శింగనమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు దేవాలయాల్లో శనివారం కార్తీక మాస ముగింపు పూజలను ఘనంగా నిర్వహించారు. శింగనమలలోని ఆత్మసీతా రామదేవాలయం, చిన్నకాలువ శివాలయం, దిద్దికెలు అంజనేయస్వామి, దుర్గాంజనేయ స్వామి, మరవకొమ్మ ఆంజనేయస్వామి దేవాలయాలు, నగరేశ్వరి ఆలయం చెన్న కేశవాలయం, చిన్నజలాలపురం దొనరామేశ్వరాలయాల్లో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి దీపాలు వెలిగించారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హక్కులపై అవగాహన ఉండాలి

అనంతపురం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన చట్టాలు, పౌరహక్కుల గురించి తెలుసుకుని, తదనుగుణంగా జీవించాలని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు శనివారం బుడ్డప్ప నగర్‌లో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ స్థానికులతో ముఖాముఖి మాట్లాడారు. చట్టాలు, హక్కులపై అవ గాహన కల్పించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ సమాన మేనని, వివక్ష లేకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

ప్రకాష్ సేవలు మరువలేనివి

అనంతపురం సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రకాష్ మాదిగ సేవలు మరువలేనివని ఆ సంఘం నాయకులు గుర్తుచేసుకున్నారు. నగరంలోని ఉపాధ్యా య భవన్‌లో ప్రకాష్ మాదిగ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వామ్రాట్ మధు, ఎంఈఎఫ్ నాయకుడు బండారు శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రకాష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, పెద్దన్న, అహ్మద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో ఎన్‌సీసీ

● కల్నల్ ఎల్‌డీ రోడ్రిగ్స్

అనంతపురం సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ఎన్‌సీసీ లక్ష్యమని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎల్‌డీ రోడ్రిగ్స్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో శనివారం సమావేశమైన ఆయన ఆంధ్రబెటాలియన్ సాధించిన విజయాలను వివరించారు. పలువురు అధ్యాపకులు, ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

అనంతపురం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న శీనానాయక్ భార్య సుజాతబాయికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం దక్కింది. శనివారం రామ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఆర్ భార్గవ్ చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఆమెకు శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి డీఆర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల పాటు హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ పొందనున్నారు.

బాధ్యతలు అప్పగించిన ఏఓ

అహుడా ఏఓగా సెలవుపై వెళ్లిన ఏఓ లక్ష్మీదేవి సెక్రటరీకి బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'అహుడా లో కలకలం' కథనానికి ఏఓ స్పందించారు. శుక్రవారం రాత్రి అహుడా కార్యాలయానికి వచ్చి బాధ్యతలు అప్పగించారు. కొన్ని మాన్యువల్ ఫైల్స్ అప్పగించినట్లు తెలిసింది.

ఘర్షణలో నలుగురికి గాయాలు

గార్లదిన్నె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో భూమి విషయంలో ఘర్షణ చోటుచేసుకుని నలుగురికి గాయాలయ్యాయి. యర్రగుంట్లకు చెందిన ఖాసిం కుటుంబం ఆదే గ్రామానికి చెందిన ఎస్టీ గంపమల్లయ్య కుటుంబం కొద్దిరోజుల నుంచి సుమారు 40 సెంట్ల భూమి విషయంలో తరుచు గొడవపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదైంది. వారు శనివారం మళ్లీ గొడవపడ్డారు. ఈ ఘర్షణలో ఖాసింకు, ఖాదర్ బాషాకు, గంపమల్లయ్యకు మరొకరికి గాయాలయ్యాయి. వారంతా ఆస్పత్రిలో చేరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనులపై దాడి హేయం

అనంతపురం సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులపై దా డి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ ఎరుకుల సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ప్రభుత్వ సర్వజ నాసుపత్రిలో చికిత్స పొందుతున్న గార్లదిన్నె మండలానికి చెందిన రామాంజినమ్మ కుటుంబ సభ్యులు మాధవయ్య, గంపమల్లయ్యను వారు శనివారం పరామర్శించారు. నాయకులు పోలా రామాంజినేయులు, సాకే చిరంజీవి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నేతలు మారినా.. మారని స్థితి

● అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గ కేంద్రం
● హామీలకే పరిమితమైన చెరువు లోకలైజేషన్



శింగనమల ప్రధాన కూడలి

శింగనమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేరుకే నియోజకవర్గం కేంద్రం. ఎంతమంది పాలకులు మారినా శింగనమల అభివృద్ధి శూన్యం. గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని గతంలో పలువురు ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా ఇంతవరకు చొరవ చూపకపోవడం కొసమెరుపు. 1952లో పుట్లూరు నియోజకవర్గం నుంచి శింగనమల నియోజకవర్గంగా మారింది. నియోజకవర్గ కేంద్రం శింగనమల. ఈ గ్రామానికి ప్రధానమైన శింగనమల చెరువు. గతంలో వర్షాలు బాగా కురవడంతో చెరువు నిండి, ఆయకట్టు కింద మూడు పంటలు సాగు చేసేవారు. అయితే కొన్నేళ్లుగా వర్షాలు సరిగా కురవక చెరువుకు నీరు అంతంత మాత్రంగానే చేరుతోంది. దీంతో చెరువును లోకలై జేషన్ చేయిస్తామని దాదాపు నలభై ఏళ్ల కిందటి ఎమ్మెల్యే గురుమూర్తి నుంచి గత వైసీపీ మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వరకు చాలామంది హామీ ఇచ్చారు. కానీ జీఓ తీసుకురాలేకపోయారు. ఇదిలాఉంటే శింగనమల 1952లో నియోజకవర్గ కేంద్రంగా మారినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. రోడ్డు విస్తీర్ణం చేపట్టలేదు. ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది.

చెరువులో నీరుంటే గ్రామం సుభిక్షం

గతంలో బాగా వర్షాలు కురిసి చెరువులో నీరు పుష్కలంగా ఉండడంతో మూడు పంటలు పండి శింగనమల కళకళలాడేది. రాను రాను వర్షాలు రాకపోవడంతో చెరువులోనికి నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. దీంతో వ్యవసాయ పనులు లేకపోవడంతో శింగనమల, గోవిందరా యుని పేటకు చెందిన వారు అనంతపురంలో హమాలీలుగా స్థిరపడ్డారు. మహిళలు, యువకులు అనంతపురంలో ఏదో ఒక పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు మూడు పంటలతో కళకళలాడిన గ్రామం నేడు కరువుతో అల్లాడుతోంది. చెరువులో నీరు చేరాలంటే చెరువు లోకలైజేషన్ ఒక్కటే పరిష్కారమని పాలకులు దానిపై దృష్టి సారించారు.

అర్ధంతరంగా ఆగిన అండర్ డ్రైనేజీ

శింగనమల పరిశుభ్రంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి రూ. కోటితో అండర్ డ్రైనేజీ అని పనులు ప్రారంభించారు. 20 శాతం కూడా పూర్తి కాకుండానే మధ్యలోనే వదిలేశారు. దీంతో గ్రామంలో మురుగు నీరు ఎక్కడ పడేతే అక్కడ నిలిచిపోతోంది. దానితో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. అలాగే శింగనమల చెరువు కట్ట నుంచి దర్గా వరకు రోడ్డు వెడల్పు పనుల కోసం మాజీ ఎమ్మెల్యే భర్త ఆలూరు సాంబశివారెడ్డి రూ. 1.20 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అయితే ఎక్కడా పనులు చేయలేదు 200 మీటర్ల సీసీ రోడ్డు వేసి మమ అనిపించారు. ప్రతిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన తరువాత శింగనమ లను దదత్త తీసుకుంటున్నామని చెప్పిన మాజీ ఎమ్మెల్యేలు సాకే శైలజానాథ్ యామినీబాల, పద్మావతి అభివృద్ధిని పట్టించుకోలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

చెరువు లోకలైజేషన్ తప్పక చేయాలి



గత 30 సంవత్సరాల నుంచి చెరువు కింద పంట సాగు సక్రమంగా లేదు. మా చిన్నతనంలో ఇంటికి వచ్చిన వాళ్లకు కడుపు నిండా బువ్వ పెట్టే వాళ్లం. ఇప్పుడు పంటలు లేక ఇంటి వద్దకు వచ్చిన వారిని మాట వరుసకైనా బువ్వ తినమని అడగలేక పోతున్నాం. చెరువులో నీరుంటే గ్రామానికి పూర్వవైభం వస్తుది. చెరువుకు ప్రతి సంవత్సరం నీరు రావాలంటే లోకలైజేషన్ ఒక్కటే మార్గం.

- పూల గోవిందు, శింగనమల

ఉపాధి మార్గాలు చూపాలి



మా ఊరిలో అందరికి వ్యవసాయ పనులతోనే జీవనోపాధి. అయితే 30 ఏళ్ల నుంచి ఎక్కడా పం టల్లేవు. దీంతో చాలా మంది జీవనోపాధి కోసం అనంతపురం వెళ్లి హమాలీలుగా, దుకాణాల్లో వర్కర్లుగా జీవిస్తున్నారు. వర్షాల ద్వారా చెరువులోకి నీరు చేరుతుందనే నమ్మకం లేదు. ప్రభుత్వం స్థానికంగా చిన్న పరిశ్రమలు చేసి యవతకు ఉపాధి కల్పించాలి

- దఫేదార్ నారాయణ స్వామి, శింగనమల

ఇప్పటికైనా పాలకులు స్పందించాలి



ఎన్నికల సమయంలో నాయకులు చెరువు లోకలైజేషన్ మాటతో శింగనమలకు వస్తా రు. ఆ తరువాత ఐదేళ్ల కాలం గడుపుతారు. గత ఆరుగురు ఎమ్మెల్యేలు ఇదే తరహాలోనే వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే పద్మావతి లోకలైజేషన్ చేశామని ప్రచారం చేశారు. చెరువులో నీరు లేనప్పుడు చుక్క నీరు ఇవ్వలేదు. ఇప్పటికైనా పాలకులు చెరువు లోకలైజేషన్‌పై దృష్టి పెట్టాలి.

- శంకర్‌గౌడ్, శింగనమల

సీఎంను కలిసిన అహుడా చైర్మన్



సీఎం చంద్రబాబునాయుడుతో టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నేమకల్లు హెలీప్యాడ్ వద్ద శనివారం సీఎంను కలిసి సన్మానించారు. అహుడా అభివృద్ధిలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మార్క్ చూపించాలని సీఎం సూచించినట్లు టీసీ వరుణ్ తెలిపారు.

'ఎమ్మెల్యే దగ్గుపాటిపై నోరు జారితే ఖబడ్దార్'

అనంతపురం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌పై నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని వైసీపీ నాయకుడు పెన్నోబులేసును తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ హెచ్చరించారు. ఆయన శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి చేశామని చెప్పుకుంటూ ఎంత అవినీతి చేశారో రాష్ట్రామంతా తెలుసునన్నారు. 40 ఏళ్లుగా నగర ప్రజలు అనంత కుటుంబాన్ని ఆదరిస్తే ప్రజలకు ఏం చేశారని నిలదీశారు. అబద్ధాలు, అవినీతి వైసీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మరో సారి ఎమ్మెల్యే దగ్గుపాటిపై అనుచితంగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

జేసీపీఆర్ మాటతీరు మార్చుకో : మేయర్

అనంతపురం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మాటతీరు మార్చుకోవాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని నగర మేయర్ మహమ్మద్ వసీం, కార్పొరేటర్లు హితవు పలికారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లతో కలిసి మేయర్ మాట్లాడారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రజాసమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేయడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, నరసింహులు, రహంతుల్లా, ఇషాక్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, చంద్రలేఖ, లావణ్య, హసీనా భేగం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డు వేయడానికి వీలులేదంటూ టీడీపీ ఎస్సీసెల్ నాయకుడిపై దాడికి యత్నించిన చెన్నేకొత్తపల్లికి చెందిన వైసీపీ నాయకుడు గంగన ఓబిరెడ్డి ఆలియాస్ ఓబుళపతిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని పెనుకొండకు వెళ్లే రోడ్డు పక్కనసీసీ రోడ్డు పనులు చేయిస్తున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు శివపై శుక్రవారం వైసీపీ నాయకుడు ఓబిరెడ్డి కులంపేరుతో దూషిస్తూ దాడికి యత్నించిన విషయం తెలిసిందే. దీంతో శివ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులకు పండ్ల వినియోగంపై వివరిస్తున్న కరస్పాండెంట్

అనంతపురం విద్య, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మనం తీసుకునే ఆహారంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, జంక్ ఫుడ్‌కు పిల్లలు దూరం గా ఉండాలని మినర్వా కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని మినర్వాఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం హెల్త్ ఈజ్ వెల్త్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా నిత్యజీవితంలో తినాల్సిన పండు, కూరగాయలను ప్రదర్శించారు. వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. . కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన పీవీకేకే విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈలో చివరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉద్యోగా లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ప్రముఖ శ్రీ అబిరామి ఇంజనీరింగ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. శనివారం కళాశాలలో ఉద్యోగాలకు సంబంధించిన ఆర్డర్ కాపీలు విద్యార్థులు అందుకున్నారు. వారిని కళాశాల చైర్మన్ పల్లె కిశోర్, ఇతర యాజమాన్య సభ్యులు అభినందించారు. కళాశాల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి మహేష్, ఏఓ మనోహర్‌రెడ్డి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

రూరల్‌లీగ్ పోటీల్లో తపోవనం, పీటీసీ జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రూరల్ లీగ్ క్రికెట్ పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, పీటీసీ జట్లు విజయం సాధించాయి. ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంత క్రీడాగ్రా మంలో అండర్-15 బాలుర రూరల్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. తపోవనం క్రికెట్ అకాడమీ, హిందూపురం టీసీఏ జట్లు తలపడగా.... టీసీఏ 40 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 238 పరుగులు చేసింది. కౌశిక్ 64, అభినవ్ సాత్విక్‌రెడ్డి 40, తన్మయి కార్తిక్‌రెడ్డి 38పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన హిందూపురం 35 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయింది. టీసీఏ బౌలర్లు దుర్గప్రణీత్, ధనుష్ చెరో 3 వికెట్లు తీసి జట్టుకు 123 పరుగుల తేడాతో విజయాన్నందించారు. మరో మ్యాచ్‌లో పీటీసీ, గుంతకల్లు రైల్వేస్ జట్ల పోరులో మొదట బ్యాటింగ్ చేసిన పీటీసీ 30.2 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బరిలోకి దిగిన గుంతకల్లు రైల్వే జట్టు 29.2 ఓవర్లలో 117 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో పీటీసీ 15పరుగుల తేడాతో విజయం సాధించింది.

రేపు పారా క్రీడాకారులకు అథ్లెటిక్ క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదా నంలో పారా క్రీడాకారులకు అథ్లెటిక్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభి వృద్ధి శాఖాధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వివరాలకు అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో లేదా ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

డిజిటల్ కరెన్సీ బదిలీతో భద్రత

అనంతపురం సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిజిటల్ కరెన్సీ లావాదేవీలతో భద్రత లభిస్తుందని హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ దేబాశిష్ పేర్కొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో శనివారం వీసీ ప్రొఫెసర్ కోరి ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియా ఎకానమి అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ప్రొఫెసర్ దేబాశిష్ మాట్లాడుతూ ఆర్బీఐ, ఎన్పీసీఐ వంటి సంస్థల ద్వారా డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

కవులు కళాకారుల సమ్మేళన పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీడీ జనార్దన్, అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సహస్ర కవులు, కళాకారుల మహాసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ అనంతరాముడు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవనంలో ఆ ట్రస్ట్ లిటరేచర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ చైర్మన్, పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్‌తో కలిసి సంబంధిత పోస్టర్లను శనివారం ఆవిష్కరించామని తెలిపారు. ప్రతిభ ఉన్న కవులు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు జనవరిలో మూడురోజులపాటు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సహస్ర కవులు, కళాకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అర్బన్ బ్యాంకులో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తున్న చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ది అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. శనివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో ఉన్న అర్బన్‌బ్యాంకులో చైర్మన్ జేఎల్ మురళీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ సాంకేతిక యుగంలో మారుతున్న బ్యాంకింగ్ వ్యవస్థకు అనుగుణంగా ఖాతాదారులకు మెరుగైన డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యంగా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జాతీయ బ్యాంకులకు, వాణిజ్య బ్యాంకులకు దీటుగా తమ బ్యాంకు సేవలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే సీటీఎస్ చెక్‌బుక్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. యాక్సిస్‌బ్యాంకు ఏపీ సర్కిల్ హెడ్ రవీంద్రనాథ్, అర్బన్ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్; పాలకవర్గ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం జిల్లాలోని పలు ఎరువులు, క్రిమిసంహార మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఓం సాయి ట్రేడర్స్ పెస్టిసైడ్స్, మన గ్రోమోర్ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేశారు. ఓం సాయి ట్రేడర్స్ పెస్టిసైడ్స్‌లో కాలంచెల్లిన ఐదు రకాల పురుగుల మందులు ఉన్నట్లు గుర్తించి, 27.5 లీటర్ల మందును సీజ్ చేసినట్లు ఏఓ వాసుప్రకాష్ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్పకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో రాష్ట్రం అప్పుల పాలు

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే దగ్గుపాటి



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభు త్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. అనంతపురం అర్బన్ పరిధిలోని 9, 49వ డివిజన్‌లలో శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ఎన్ని ఇబ్బందులున్నా... ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మాజీ మేయర్ స్వరూప, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, గంగారామ్, రాయల్ మురళి, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, రాజారావు, పోతుల లక్ష్మీ నరసింహులు, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి, లక్ష్మీనరసింహ, దళవాయి వెంకటనారాయణ, మధు రాయల్, రమేష్, ఓంకార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాంబాబు, స్వప్న, సంగా తేజస్విని, శాంతిసుధ, కంఠాదేవి, చరిత తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి కానుకగా కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. నియోజవర్గ కేంద్రమైన రాప్తాడులో శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను అధికారులతో కలిసి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కువ సంఖ్యలో పింఛన్లు, రేషన్‌కార్డులు తొలగించారన్నారు. అలా పింఛను, రేషన్‌కార్డు కోల్పోయిన వారు, కొత్త వారు డిసెంబరులో దరఖాస్తు చేసుకుంటే సంక్రాంతి కానుకగా అందజేస్తామన్నారు. అలాగే జిల్లాలో తొలి గోకులం షెడ్డు పూర్తి చేసింది రాప్తాడు మండల కేంద్రంలోనే అన్నారు. వచ్చే నెలలో మొత్తం అన్ని షెడ్లు పూర్తి చేసి ప్రారంభిస్తామని, త్వరలోనే రాప్తాడులో రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ అనూరాధ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, టీడీపీ నాయకులు ధర్మవరపు మురళి, సర్పంచ్ సాకే తిరుపాలు, మండల కన్వీనర్ కొండప్ప, శ్రీనివాసులు, గంగలకుంట రమణ, గోనిపట్ల శీన, ఇంద్ర, బీరన్న, నారా యణస్వామి, మరూరు గోపాల్, కిష్ట, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



బుక్కరాయసముద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

బుక్కరాయసముద్రం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని గురవయ్యసేను కొట్టాలలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇకపై ఒక నెలలో పింఛన్ తీసుకోని వారికి రెండింటినీ మరుసటి నెలలో ఇచ్చే అవకాశంను ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి 2 నుంచి కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించందని తెలిపారు. అలాగే బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో మౌలిక సదుపాయల కోసం త్వరలోనే దాదాపు రూ. 2కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు పలు కాలనీల్లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మన్ రాజ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, మండల కన్వీనర్ అశోక్‌కుమార్, టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎస్ నారాయణస్వామి, పొడరాళ్ల రవీంద్ర, కేశన్న, ఓబులపతి, సీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగింది. 96శాతం పంపిణీ చేసినట్లు మండల అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రవీంద్రా రెడ్డి, కందుళ ఓబులపతి, రామదాసు, అక్కులన్న తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలుసున్నాడని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సర్పంచ్ దేగల లలితమ్మ అన్నారు. వారు శనివారం మండలంలోని గుమ్మే పల్లి పంచాయతీలో గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లిల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

● కనగానపల్లి: సామాజిక పింఛన్లను శనివారం టీడీపీ నాయకులు పంపిణీచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి పాల్గొని మామిళ్లపల్లిలో పింఛన్లు పంపిణీచేశారు. త్వరలోనే ప్రభుత్వం రేషన్‌కార్డులు, పింఛన్లు అందిస్తుందన్నారు.

పింఛన్ పునరుద్ధరించి పంపిణీ



పెద్దన్నకు పింఛన్ అందజేస్తున్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన కడపల పెద్దన్న మతిస్థిమితం లేకపోవడంతో ఏడు నెలల క్రితం గ్రామం విడిచి వెళ్లాడు. ఎవరికీ తెలియకుండా ఒక అనాథాశ్రమంలో చేరాడు. ఆచూకీ తెలుసుకున్న టీడీపీ జిల్లా నాయకుడు, గ్రామ ఉప సర్పంచు ఆలం వెంకటనరసానాయుడు అతడిని గ్రామానికి తీసుకొచ్చాడు. సచివాలయం సిబ్బందితో కలిసి ఉన్నతాధికారులను సంప్రదించి అతడి పింఛన్‌ను పునరుద్ధరించారు. పునరుద్ధరించిన పింఛన్‌ను ఆయన అధికారులతో కలిసి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో దాదాపీర్, వెల్ఫేర్ సెక్రటరీ శంషాద్ బేగం, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

రామగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామంలో కనకదాస జయంతి వేడుకలను శనివారం కురుబ కులస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళుల ర్పించారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కంటిమద్ది రంగయ్య పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు.

క్లుప్తంగా..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన నారాయణ గుత్తికి బైక్‌పై బయలుదేరాడు. అయితే పట్టణంలో కర్నూలు రోడ్డులో ఎదురుగా మరో బైకు వచ్చి ఢీకొంది. ప్రమాదంలో నారాయణతో పాటు మరో బైక్‌లో ప్రయాణిస్తున్న జయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైల్వే డీజిల్ షెడ్‌లో ఎన్నికల ప్రచారం

గుత్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆర్‌యస్‌లో గల రైల్వే డీజిల్ షెడ్‌లో శనివారం డివిజనల్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. రైల్వే గుర్తింపు సంఘాల కోసం ఈ నెల 4నుంచి 6వ తేదీలలో జరుగు ఎన్నికలలో మజ్దూర్ యూనియన్‌కు ఓటు వేసి గెలింపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. రైల్వే డీజల్ షెడ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, సీఎండబ్ల్యూ, బుకింగ్ కార్యాలయాల వద్ద ప్రచారం నిర్వహించారు. ఏడీఎస్‌లు అశ్విని, నారాయణ, డివిజన్ కోశాదికారి శర్మ, యూనియన్ సభ్యులు మస్తాన్ వలి, రామంజునేయులు రెడ్డి, శేఖర్ బాబు, మనోహర్‌బాబు, రవికుమార్, రామ్‌నాయక్, సుధాకర్ పాల్గొన్నారు

ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడ్డానికి కారణమైన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పట్టణంలో తాగునీటి పైపులైన్లను మరమ్మతు చేయడంలో తాత్సారం చేసి నీటి సమస్య ఏర్పడ్డానికి కారకులయ్యారన్నారు. నిర్లక్ష్యం వహించిన ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటర్ ట్యాంకుల సరఫరా విషయంలో మున్సిపల్ ఇంజనీర్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కమిషనరుకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు రఘునాథ రెడ్డి, జిలాన్, సత్తార్, తురకపల్లి రామాంజనేయులు, ఐఎఫ్‌టీయూ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. .

కార్తీక వనభోజనాలు

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమంలో జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కార్తీక వనభోజనాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఉమామహేశ్వర ఆశ్రమం పీఠాధిపతి ప్రణవానందగిరి స్వామి, కలహోల మఠం పీఠాధిపతి చెన్నవీర శివాచార్యస్వామి, మహేశ్వరనందస్వామి హాజరయ్యారు. ఆశ్రమంలోని చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక వనమహోత్సవాన్ని ప్రారంభించారు. 22ఏళ్ల తర్వాత కార్తీక వనభోజనాలు జరుగుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్తీకమాసం ఆఖరి రోజుల కావడంతో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉసిరిచెట్ల కింద భోజనాలు చేశారు. జంగం సంక్షేమ సంఘం నాయకులు బండయ్య, రాచప్పయ్య, రుషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించండి

విడపనకల్లు నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ ఏఈ సత్యంను శనివారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం పలువురు నాయకులు మట్లాడుతూ.. మండల కేంద్రంలోని బిల్డింగ్‌ల కాలనీ, కృష్ణదేవరాయలు కాలనీ, సుబ్బలక్ష్మి కాలనీలో విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి శిథిలావస్థలో ఉన్నాయన్నారు. వాటి వల్ల ప్రమాదం పొంచి ఉందన్నారు. కనుక వెంటనే తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలంటూ కోరారు. నాయకులు బండి పాపారాయుడు, విజయ్ శెట్టి, డీలర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం, స్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం వారు శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వినియోగం చేసుకోవాలని కోరారు.

హెల్పర్‌కు పాము కాటు

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేమకల్లు పర్యటన సందర్భంగా హెలీప్యాడ్ వద్ద పనులు చేయడానికి వచ్చిన హెల్పర్ శర్మస్‌ను పాము కాటు వేసింది. కణేకల్లు కు చెందిన శర్మస్ నేమకల్లులో హెలీప్యాడ్ వద్ద సీఎం రాకకు ఏర్పాట్లు చేసి శుక్రవారం రాత్రి అక్కడే నిద్రించాడు. కాగా అర్ధరాత్రి సమయంలో పాము శర్మస్ కుడి కాలికి కాటు వేసింది. వెంటనే స్థానికులు అతడిని డీ హీరేహాళ్ ఆసుపత్రికి తరిలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదని శర్మస్ కుటుంబ సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. శర్మస్‌కు పాము కాటు వేయడం వల్ల మాటలు పడిపోయాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి మెరుగైన చికిత్సకు సహకారించాలని వారు కోరారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పుట్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికాపుల గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి అనారోగ్యరీత్యా శస్త్రచికిత్స చేయించుకుని ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. దీంతో శనివారం తాడిపత్రి నియోజకవర్గ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, వేలూరు రాజశేఖర్‌నాయుడు వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. పరామర్శించిన వారిలో నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.



శివశంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎస్వీ రవీంద్రారెడ్డి

నేమకల్లును అన్ని విధాలా అభివృద్ధి చేస్తా..

- ప్రజావేదికలో సీఎం చంద్రబాబు
- గ్రామంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ

బొమ్మనహాళ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం నేమకల్లుకు వచ్చిన ఆయన అక్కడి ప్రజావేదిక సభలో గ్రామాభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. నేమకల్లును ఒక మోడల్ గ్రామంగా తయారు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను వెంటనే ఆదేశించారు. గ్రామంలో ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో 112 పక్కాగృహాలు మంజూరు చేస్తామని, ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని, బస్సు సౌకర్యం కల్పిస్తామని, ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ప్రతివీధిలోనూ సీసీరోడ్లు, డ్రైనేజీలు బాగుచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆంజనేయస్వామి ఆల య అభివృద్ధికి సీజీఎఫ్ కింద రూ. మూడు కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఏదో ఒకరోజు నేమకల్లు గ్రామాన్ని తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అభివృద్ధి పనులు ఎంతవరకు జరిగాయో స్వయంగా పరిశీలిస్తానని సీఎం పేర్కొన్నారు. మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ చెరువుకు తుంగభద్ర ఎగువకాలువ నుంచి నీరు ఇవ్వాలని పలువురు కోరగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అక్కడి ప్రత్యేక పరిస్థితులను తీసుకుని పరిశ్రమలు తెచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. శ్రావణమాసంలో అనంతపురం జిల్లాలో మురడి, నేమకల్లు, కసాపురం ఆలయాలను సమన్వయం చేస్తూ ఒకే రోజు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు. ప్రజల ఆశయాలు నెరవేర్చడానికి అనునిత్యం పని చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నేమకల్లు గ్రామస్థులతో సీఎం చంద్రబాబు

ప్రజలతో మాటామంతి

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో పాల్తూరు రుద్రమ్మ ఇంటిలో పింఛన్ డబ్బులు ఇచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బయటకు వస్తూ స్థానిక ప్రజలతో ముచ్చటించారు. ఏమ్మా అందరూ బాగున్నారా? ఏం పనులు చేస్తున్నారని పలకరించారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. గ్రామంలో డ్రైనేజీలు లేవని, ఇక్కడికి బస్సు రాదని పలువురు తెలిపారు. ఇంకా కొందరు వివిధ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన బదులిస్తూ ఓకేనమ్మా.. మీ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. రోడ్డు పక్కన ఎదురు చూస్తున్న వృద్ధులను, విద్యార్థులనూ సీఎం పలకరించారు. బాగా చదువుకోవాలని, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. కొందరు యువకులు సీఎంతో సెల్ఫీలు దిగారు.



ఇందిరమ్మ కాలనీవాసులతో సీఎం చంద్రబాబు



విద్యార్థినులతో మాట్లాడుతూ..

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని కోట వీధిలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్ర తి నెలా పింఛన్లు ఇవ్వాలంటే వలంటీర్లు రూ. 50 వరకు వసూలు చేసేవారని ఆరోపించారు. అదే కూటమి పాలనలో ఎమ్మెల్యేతో పాటు, అన్ని శాఖల అధికారులు స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. సీఎం ఒకే సారి పింఛన్‌ను నాలుగు వేలకు పెంచి పేదలకు తోడ్పాటునందించారని పేర్కొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలో చేపట్టిన పిం ఛన్ల పంపిణీని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరిశీలించారు. ఇప్పటివరకు దేశంలో ఏ ఒక్క రాష్ట్రం కూడా 30న పింఛన్ల పంపిణీ చేసి న సందర్భం లేదన్నారు. మండలంలో 94 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నందకిషోర్ తెలిపారు.



కళ్యాణదుర్గంలోని కోట వీధిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

శెట్టూరు: మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలలో పింఛన్లను 95 శాతం పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామారావు తెలిపారు. 5682 మంది లబ్ధిదారులు ఉండగా శనివారం ఒక్క రోజే 5403 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

బెళుగుప్ప: మండలంలో 94.26 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయమే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల ఇళ్లకు వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశామన్నారు. మండలంలో 5718 మంది లబ్ధిదారులు ఉండగా 5390 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు.

జేసీపీఆర్‌ను విమర్శించే అర్హత లేదు

తాడిపత్రి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): అనంతపురం మేయర్ వసీమ్, కార్పొరేటర్ సైపుల్లాకు జేసీ ప్రభాకరరెడ్డిని విమర్శించే అర్హత లేదని టీడీపీ కౌన్సిలర్ షెక్షావలి, మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జేసీ ప్రభాకరరెడ్డి భాష గురించి వైసీపీ వారు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి టీడీపీ మహిళా కౌన్సిలర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మీరందరూ ఎక్కడికి వెళ్లారంటూ ప్రశ్నించారు. ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ఎదుట దాదాపు 70ఎకరాల ప్రభుత్వ భూమిని కుటుంబ సభ్యుల పేర్లమీద మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు. కరోనా సమయంలో కేవలం బ్లీచింగ్‌పౌడర్ కోసం రూ.3కోట్లు డ్రాచేసిన ఘనత అనంతకే దక్కిందన్నారు. ఈ విషయాన్ని కౌన్సిల్‌మీట్‌లో ప్రశ్నించిన డిప్యూటీ మేయర్ వసంతమ్మకు ఇప్పటివరకు సమాధానం చెప్పలేకపోయారని దుయ్యబట్టారు.

మఠం ఆస్తులను పరిరక్షించాలి

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మఠం ఆస్తులను పరిరక్షించాలని, మరమ్మతులకు చేరిన మఠం పైకప్పులన్నీ బాగు చేయించాలని వీరశైవసంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గవిమఠంలో గవిమఠం సిబ్బంది నారాయణస్వామికి శనివారం ఆ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. గత 20ఏళ్ల నుంచి కార్తీక మాస పౌర్ణమి రోజున లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేవారని, ఈ సంవత్సరం ఆ కార్యక్రమాన్ని చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. దీనివల్ల ధార్మిక సంప్రాదాయం దెబ్బతింటోందన్నారు. కోట్ల రూపాయల విలువైన ఇక్కడి రథాన్ని 25ఏళ్ల నుంచి పాత షెడ్‌లోనే ఉంచుతున్నారని, దీని వల్ల వర్షానికి రథం పాడవుతోందని వాపోయారు. ఇందు కోసం కొత్త షెడ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు నాగన్నగౌడ్, బొజ్జప్ప, నిరంజన్‌గౌడ్, చంద్ర, గంగాధర్, నాగరాజు, మల్లికార్జున, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పుట్లూరు/ యల్లనూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పాఠకులు, విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని లైబ్రేరియన్ జయరాములుకు సూచించారు. అలాగే యల్లనూరులోని గ్రంథాలయాన్ని కూడా ఆమె తనిఖీ చేశారు.

అపరిశుభ్రత నడుమ అంగన్‌వాడీ కేంద్రం

- ఇబ్బంది పడుతున్న చిన్నారులు

కుందుర్పి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనగల్లు గ్రామంలో గల అంగన్‌వాడీ కేం ద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెద్దఎత్తున ఉన్నాయి. దీంతో అక్కడ తీవ్ర అపరిశుభ్రత నెలకొని ఉంది. దీనివల్ల విషపురుగులు సంచరించే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు అంగన్‌వాడీ కేం ద్రం ముందు చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అదేవిధంగా స్థానిక గ్రామ సచివాలయం చుట్టూ కూడా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఇదే దుస్థితి నెలకొంది. చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగక ముందే ముళ్ల కంపలను, పిచ్చిమొక్కలను తొలగించాలని, పరిసర ప్రాంతాలు శుభ్రపరచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం వెనుకవైపు భారీగా ఉన్న ముళ్లపొదలు

నెట్టికంటి సేవలో విజయవాడ సిటీ డీసీపీ

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆ లయాన్ని విజయవాడ సిటీ డీసీపీ ఉదయ రాణి శనివారం ఉదయం సందర్శించారు. డీసీపీని ఆలయ అధికారులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు , స్వామి దర్శ నం చేయించి పూజలు, అర్చనలు జరిపిం చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు చక్రవర్తి, ఆలయ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న డీసీపీ ఉదయ రాణి

కన్నులపండువగా పూల రథోత్సవం

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి పూల రథోత్సవాన్ని శనివారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలరథోత్సవంలో ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, అష్టోత్తర పూజలు, విశేష పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుని ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత సాయంత్రం పూలరథోత్సవాన్ని నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏటా చివరి శనివారం పూల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూలరథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పట్టుకోండి చూద్దాం..

- పోలీసులకు సవాల్ విసురుతున్న కేబుల్ దొంగలు
- దైవాలమడుగులో తాజాగా ఐదుగురు రైతుల పొలాల్లో కేబుల్ చోరీ







సుబ్బారెడ్డి తోటలో కేబుల్ కట్ చేసి తీసుకెళ్లిన దొంగలు, దస్తగిరి .. బాలకొండారెడ్డి పొలాల్లో..

యాడికి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామంలో శుక్రవారం రాత్రి ఐదుగురు రైతుల తోటల్లో దొంగలు పడి వ్యవసాయ బోర్ల మోటార్లకున్న కేబుల్‌ను చోరీ చేశారు. దుండగులు వరుసగా కేబుల్ చోరీలు చేస్తూ మీకు చేతనైతే మమ్మల్ని పట్టుకోండి చూద్దాం అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తోంది. గ్రామంలో తిరుమలరెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బాలకొండారెడ్డి, దస్తగిరి తోటల్లో శుక్రవారం రాత్రి దొంగలు పడి బోరు మోటార్లకున్న కేబుల్‌ను చోరీచేశారు. రైతులు మొక్కజొన్న, అరటి తదితర పంటలు సాగుచేస్తున్నారు. దొంగలు కేబుల్‌ను ఎత్తుకెళ్లడంతో నీరు అందించలేక చాలా మంది పంటలను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. కేవలం దైవాలమడుగు గ్రామంలోనే 15రోజుల వ్యవధిలో 20మంది రైతుల తోటల్లో 30వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌వైర్లను దొంగలు చోరీచేయడం గమనార్హం. ఈ నెల 26న తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు కేబుల్‌వైర్ల చోరీ తీరుపై స్వయంగా పరిశీలించారు. కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, దొంగలను పట్టుకోవడానికి టెక్నికల్‌గా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిబ్బందిని గస్తీకి తిప్పుతామని తెలిపారు. ఇంతవరకు కేబుల్‌వైర్ల దొంగలను ఒక్కరిని కూడా పట్టుకున్నది లేదు. దీంతో దొంగలు వరుస చోరీలతో రైతులను హడలెత్తిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు సాగు చేసేది కష్టమే అంటూ మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

కసాపురంలో వెండి రథ ప్రాకారోత్సవం

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి వెండి రథంపై కొలువుదీర్చారు. ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ నేతృత్వంలో వెండి రథ ప్రాకారోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు పిడికిటి వెంకటేశులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.



వెండిరథంలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులు

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

గుత్తిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి వివిధ పుష్పాలతో అలంకరించి ఆకుపూజలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మహా మంగళ హారితినిచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో రంగనాథ స్వామి

అభయాంజనేయ స్వామికి ..

గుత్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌ఎస్‌లో వెలసిన అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అర్చకులు స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం చేసి వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారితినిచ్చారు. తర్వాత భక్తులకు దర్శన కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మాల ధరించిన భక్తులు ఆంజనేయస్వామి చిత్రపటాని పట్టణంలో వీధుల్లో ఊరేగించారు.



స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వా మి ఆలయంలో శనివా రం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పెన్నానదిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వాములను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

అయ్యప్ప భక్తులకు మైనార్టీ నాయకుడి అన్నదానం

పామిడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు టీడీపీ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు కొట్టం మాలిక్ బాషా శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతో నిష్ఠతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని కల్గిస్తోందన్నారు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ మైనార్టీ నేత



నేమకల్లు పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబును ప్రజావేదికపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సన్మానించారు. శాలువ కప్పి చంద్రబాబు దంపతుల చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో జరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఎస్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సులభంగా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశ్యంతో ప్రస్తుతం చాలామంది టెక్నాలజీని వాడి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కష్టించి చదివి ఎదగాలే కానీ.. అడ్డదారులు తొక్కరాదన్నారు. ఆన్‌లైన్‌లో ప్రలోభాలకు లోనై మోసపోరాదని సూచించారు. ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, అధ్యాపకులు రాఘవేంద్ర ప్రసాద్, శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని పట్టణంలోని బాలుర వసతిగృహంలో శనివారం ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ నాగరాజు , రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్‌చౌదరి, ఆంగ్ల అధ్యాపకుడు మల్లికార్జున, గాయకుడు భగవాన్ దాస్, వెటర్నరీ వైద్యుడు మల్లికార్జున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సతీసహగమనం, బాల్య వివాహాల నిర్మూలనకు గురజాడ తన రచనల ద్వారా సమాజంలో మార్పు తెచ్చారని కొనియాడారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం